క్లుప్తంగా

నేడు సమగ్ర కులగణనపై రౌండ్‌టేబుల్ సమావేశం

జంగారెడ్డిగూడెం : బీసీ చైతన్య వేదిక, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంగటలకు జంగారెడ్డిగూడెంలో జనగణనలో సమగ్ర కులగణన అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మానికల వెంకటేశ్వరరావు, బి.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. చింతలపూడి నియోజకవర్గ పరిధిలో జంగారెడ్డిగూడెంలోని సూర్య విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి బీసీ నాయకులు, ప్రతినిధులు పాల్గొనాలన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో చిప్పాడ వెంకన్న, తల్లాడి శివకుమార్, చిటికెన రాంబాబు, జి.రాము, జి.రామారావు, తదితరులు ఉన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : తాటిరామన్నగూడెంలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాద బాధితులకు బుట్టాయగూడెం షాలెం ఇవాంజిలికల్ చర్చి మినిస్ట్రీస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ పీటర్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధితులైన తాటి విజయ్‌కుమార్, మౌనికలకు 25 కేజీల బియ్యం బస్తా, కూరగాయలు, నిత్యావసర సరుకులు, దుస్తులతో పాటు రూ. 1000 నగదును కూడా ఆర్థిక సహాయంగా అందజేశారు. అలాగే 11 నెలల చంటిపాపను కోల్పోవడం పట్ల సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో సంఘస్థులు వెట్టి ఎస్తేరు, మడకం వెంకటలక్ష్మి, చోడెం ప్రకాష్, పాస్టర్ ప్రతాప్‌కుమార్, రామారావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



బాధితుడికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న గిరి భోగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు

చింతలపూడి : కిడ్నీ శస్త్ర చికిత్స చేయించుకున్న రాఘవాపురానికి చెందిన పగడం ఆదియ్యకు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గిరి భోగారావు ఆర్థిక సహాయం అందించారు. బాధితుడు రెండేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మార్చిలో కిడ్నీ శస్త్రి చికిత్స చేయించుకున్నాడు. ఆర్థిక సమస్యలతో అతడు ఇబ్బందులు పడుతున్నాడని తెలుసుకున్న భోగారావు తన వంతు సహాయంగా రూ. 50వేలను శనివారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి అందజేశారు.

జగన్‌తోనే పేదలకు సొంతింటి కల సాకారం



జగనన్న కాలనీలో లబ్ధిదారులతో జెడ్పీటీసీ కడిమి రమేష్

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సొంతింటి కల నెరవేరుతుందని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. శనివారం తడికలపూడిలో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రమేష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం నెరవేరుస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా అర్హులైన పేదలకు సొంత ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో మౌలిక సదుపాయాలతో, నూతన హంగులతో నివాసయోగ్యంగా ఇల్లు నిర్మించి పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఎంపీటీసీలు గంగుల కడియాలు, కొప్పర్తి లక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రవాణా ఇబ్బందులు లేకుండా చూడాలి

ఏలూరు (టూటౌన్): ధాన్యం కొనుగోలులో రవాణా ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలని, రవాణా ఇబ్బందులు లేకుండా సరిపడే లారీలు, ట్రాక్టర్లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుత రబీలో ఎకరాకు 75 కిలోల ధాన్యం బస్తాలు 50 నుంచి 60 వరకు దిగుబడి వచ్చిందని, ఈ లెక్కన రైతులకు ఎకరాకు 100 సంచులు అవసరం అవుతాయని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎకరాకు మొదటి 75 సంచులను ఇచ్చారని రైతులు ఆందోళన చేయడంతో 92 సంచులను ఇస్తున్నారని పేర్కొన్నారు. పంటలో 60 శాతం కొనుగోలు చేయాలని లక్ష్యం విధించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై ప్రభుత్వం స్పందించి రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రవి కోరారు.

ముస్లింలకు మేలు చేసింది జగనన్నే



దొరసానిపాడులో ముస్లిం సోదరులతో కలసి నమాజ్ చేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



చింతలపూడి మసీదులో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా



జంగారెడ్డిగూడెంలో ఈద్‌గాహ్ వద్ద దువాను ఆచరిస్తున్న ముస్లిం సోదరులు



దేవులపల్లిలో ఈద్‌గాహ్ వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

- భక్తిశ్రద్ధలతో రంజాన్ పర్వదినం
- ముస్లింలతో కలిసి నమాజ్ చేసిన ఎమ్మెల్యేలు వెంకట్రావు, ఎలీజా

ద్వారకాతిరుమల: రాష్ట్రంలో ముస్లింలకు మేలు చేసింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని దొరసానిపాడు, దేవినేని వారిగూడెం, తిరుమలంపాలెం, పంగిడిగూడెం, ఐఎస్.రామానుజాపురం గ్రామాల్లో రంజాన్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. దొరసానిపాడులో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలారి ముస్లిం సోదరులతో కలసి ఈద్గా స్థలంలో నమాజులు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ ముస్లింలకు ఈద్గా స్థలం, హిందువులకు జాతర జరుపుకునే స్థలాన్ని అధికారికంగా కేటాయించిన ఘనత తమదేనన్నారు. త్వరలో నిరుపేదలకు సైతం ఇక్కడ ఇళ్ల స్థలాలను ఇచ్చి తీరుతామని పేర్కొన్నారు. అన్ని మత గ్రంథాల కలయికే నవరత్న పథకాలని ఆయన అన్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ తమ ఈద్గా స్థలంలో గతంలో డంపింగ్ యార్డు, విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించాలని కొందరు టీడీపీ నాయకులు ప్రయత్నించారని, అయితే అప్పట్లో వాటిని అడ్డుకున్నామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఈద్గా స్థలాన్ని అప్పగిస్తానని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే తలారి నిలబెట్టుకున్నారని అన్నారు. తమకు ఈద్గా స్థలం దక్కడానికి గ్రామ సర్పంచ్ లక్కాబత్తుల సిద్ధిరాజు కృషి చేశారని పేర్కొన్నారు. అనంతరం జరిగిన ఇఫ్తార్ విందులో తలారి, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే మహిళలు సైతం ఈద్గా స్థలంలో వేరుగా నమాజులు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, డీసీఎంఎస్ డైరెక్టర్ జేవీ కృష్ణారెడ్డి, బొండాడ వెంకన్నబాబు, సొసైటీ చైర్‌పర్సన్ గుర్రాల లక్ష్మణ్, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, దర్శిపాము అన్నవరం, చిట్టిబొమ్మ ప్రసాద్, ముస్లిం మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి

చింతలపూడి : ముస్లిం మైనార్టీల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా శనివారం చింతలపూడి జామియ మస్జిద్‌కు విచ్చేసిన ఎలీజా ముస్లిం సోదరులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజాకు ప్రత్యేకంగా తయారు చేసిన ఖీర్(సేమ్యా పాయసం)ను ముస్లింలు తినిపించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ఎండీ అక్బర్ ఆలీ, ఎండీ జిలాని, ఎస్‌కే ఆజాద్, హాజీ, నవాబ్, ఇమ్రాన్, రజాక్, భక్షు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

రంజాన్ సన్మార్గానికి మార్గం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ముస్లింలు ఘనంగా రంజాన్ వేడుకలు నిర్వహించారు. స్థానిక బిలాల్ మసీదులో ప్రత్యేక నమాజ్ చేశారు. బిలాల్ మసీదు పేషిమామ్ హైదర్ ఆలీ రిజ్వి మాట్లాడుతూ రంజాన్ మాసం అనేది పవిత్రతకు, ఆత్మ శుద్ధికి, సన్మార్గానికి మార్గం అన్నారు. నెల రోజుల పాటు ఆచరించిన నియమాలను జీవితకాలం పాటిస్తే అల్లా కరుణకు పాత్రులు కాగలరన్నారు. జంగారెడ్డిగూడెంలోని ఈద్‌గాహ్ వద్ద ముస్లింలు ప్రత్యేక దువాను ఆచరించారు. అక్కడి నుంచి స్థానిక ఖబరిస్తాన్ వరకు ర్యాలీగా వెళ్లి పెద్దలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిలాల్ మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ జిలాని, రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, మసీదు కమిటీ మాజీ అధ్యక్షుడు షేక్ బాజీ, షేక్ ముస్తఫా, ముస్లిం పెద్దలు షేక్ మహబూబ్, షాజహాన్, మౌలాలి, యాకుబ్, అమీర్, హఫీజ్, ఖాదర్, ఉమర్‌ఆలీ, బడాబాబు, హుస్సేన్, సలీం, హమీద్, పండుఖాన్, రంజాని, రహంతుల్లా, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ముందస్తు చర్యలతో ప్రశాంతం

మసీదు పాత, కొత్త కమిటీల మధ్య నిధుల విషయంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న వివాదం నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. జంగారెడ్డిగూడెం, పోలవరం సీఐలు పి.బాలసురేష్‌బాబు, విజయ్‌కుమార్, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం ఎస్సైలు ఎం.సాగర్‌బాబు, జీజే విష్ణువర్ధన్, సిబ్బందితో కలిసి ఈద్‌గాహ్, కబరిస్తాన్ వద్ద బందోబస్తు నిర్వహించారు. ఈద్‌గాహ్ వద్ద ప్రార్థనలు నిర్వహించే సమయంలో ముందు వరుసలో సాంప్రదాయం ప్రకారం నూతన కమిటీ కూర్చొవాలి. అయితే పాత కమిటీ కూర్చొనడంతో కొద్దిపాటి ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ పెరిగి తోపులాట జరిగింది. ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఇరువర్గాలను శాంతింపజేశారు.

మండలంలో రంజాన్ ప్రార్థనలు

జంగారెడ్డిగూడెం రూరల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఈద్‌గాహ్‌ల వద్ద ముస్లిలు ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు నిర్వహించారు. హజ్రత్ (మతగురువు) మహ్మద్ యూసఫ్ ప్రత్యేక ప్రార్థనలు చేసి, రంజాన్ పర్వదిన విశిష్టతను వివరించారు. మసీద్ ప్రెసిడెంట్ ఎండీ అక్బర్ సలీం, షేక్ అనీష్ బాబు, షేక్ అక్బర్, సయ్యద్ మస్తాన్, షేక్ బాజీ పాల్గొన్నారు. తిరుమలాపురంలో కొత్తగా నిర్మించిన మసీద్‌లో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు లాల్ అహ్మద్ పాల్గొన్నారు. తాడువాయి, లక్కవరం తదితర గ్రామాల్లో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కొయ్యలగూడెం: ఈద్ వుల్ ఫితర్ (రంజాన్) వేడుకలు ముస్లిం సోదరులు శనివారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకున్నారు. కొయ్యలగూడెం జామియా మసీద్, కన్నాపురం, దిప్పకాయలపాడు, యర్రంపేట, రాజవరం, వేదాంతపురం గ్రామాలలోని మసీదుల వద్ద ముస్లింలు నమాజు ఆచరించారు. ఈద్గా ప్రార్థనలో తమ పూర్వీకుల ఆత్మ శాంతికై నమాజు చేశారు. బయ్యనగూడెం ఈద్గాలో నమాజ్ కమిటీ అధ్యక్షుడు పఠాన్ మహబూబ్ జానీ, ఉపాధ్యక్షుడు షేక్ షియాత్, సెక్రటరీ షేక్ బాజీ, ఎస్.రసూల్, ఎస్ఎం అలీ, సయ్యద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడులో ఘనంగా రంజాన్

వేలేరుపాడు : రంజాన్ పర్వదినాన్ని శనివారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మండలంలో వివిధ గ్రామాల నుంచి ముస్లిం సోదరులు ఉదయం 9 గంటలకే వేలేరుపాడు ఈద్గా వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇక్కడి ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు (నమాజ్) చేశారు. నమాజ్ చేసిన అనంతరం ఒకరికొకరు అలింగనం చేసుకున్నారు.

బుట్టాయగూడెం : మండలంలో ఘనంగా రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలను చెప్పుకున్నారు. బుట్టాయగూడెం, దొరమామిడి, రెడ్డిగణపవరం, రామన్నగూడెం, పులిరామన్నగూడెం, తదితర గ్రామాల్లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కుక్కునూరు : ముస్లింల పవిత్ర పండుగ రంజాన్‌ను శనివారం మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదులో ప్రత్యే ప్రార్థనలు చేశారు. కుక్కునూరులోని ఈద్గాలో సామూహిక ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఆలింగనంతో ఈద్ ముబారక్ అంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఉపవాస దీక్షలను విరమించిన ముస్లింలు

చింతలపూడి : మండలంలోని పలు గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. మత సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమానత్వానికి, దాతృత్వానికి కరుణకు ప్రతీకగా ఈ పండుగను ప్రపంచంలోని ముస్లింలు భావిస్తారు. ముస్లింలు పవిత్రంగా భావించే దివ్యఖురాన్ ఆవిష్కరించింది కూడా ఈ మాసంలోనే అవ్వడం రంజాన్‌కు మరో ప్రత్యేకత. రంజాన్ పండుగ పర్వదినాన్ని చింతలపూడి, రాఘవాపురం, ప్రగడవరం, సీతానగరం గ్రామాల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గత నెల రోజులుగా కఠిన ఉపవాస దీక్షలతో రంజాన్ మాసంలో గడిపిన ముస్లింలు శుక్రవారం ఉపవాస దీక్షలను విరమించారు. స్థానిక ఈద్‌గాహ్‌లో పేష్ యిమామ్ ఎండీ అబ్దుల్ వదూద్ ముస్లిం సోదరులతో సామూహిక ప్రార్థనలు జరిపించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకర్ని ఒకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



బయ్యనగూడెం మసీదు వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



చింతలపూడి ఈద్‌గాహ్‌లో పండుగ విశిష్టతను వివరిస్తున్న ఇమామ్



వేలేరుపాడు ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు



కుక్కునూరులో ఇమామ్ సందేశాన్ని వింటున్న ముస్లిం సోదరులు

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత



విద్యార్థినికి పరీక్షా సామాగ్రిని అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లిలో గురుకుల ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు అవసరమైన పరీక్షా సామగ్రిని సావిత్రిభాయ్ పూలే మిషన్ వారు శనివారం అందజేశారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా మిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇస్తున్నారు. అందులో భాగంగా పరీకా సామగ్రిని విద్యార్థులకు మిషన్ కన్వీనర్ చవటపల్లి కిషోర్, యంత్రపాటి కుమారస్వామి అందజేశారు.

పేదరిక నిర్మూలనే సీఎం జగన్ ధ్యేయం



శివపురంలో మహిళకు సంక్షేమ బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి : రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని శివపురం గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఎలీజా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీ రహదారులు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు మేలు చేయాలన్న సంకల్పంతో సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమచేస్తున్నట్లు తెలిపారు. సచివాలయాలు, వలంటీర్ల ద్వారా పార్టీలకు అతీతంగా పారదర్శకంగా పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎవరికైనా పథకాలు అందకుంటే సచివాలయాల్లో దరఖాస్తులు అందచేయాలని సూచించారు. మేనిఫెస్టోలో చెప్పిన దానికన్నా మిన్నగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో శివపురం సర్పంచ్ ఎస్ హరిణి, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, చింతలపూడి నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎస్ దుర్గారావు, పార్టీ నాయకులు నరుకుళ్ళ రవీంద్ర, గోపాలకృష్ణ, సర్పంచ్‌లు యడ్ల మోహన్‌రావు, కె రమేష్, మందలపు సాయిబాబు, ముసునూరు వెంకటేశ్వర్రావు, జంగా చెన్నకేశవరెడ్డి, ఎస్.కాంతారావు, మిరియాల దిలీప్, జైపాల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎలీజా పరామర్శ

చింతలపూడి : చింతలపూడి మండలం సీతానగరం ఉప సర్పంచ్ గుమ్మడపు ప్రసాద్ కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే వీఆర్‌ఎలీజా పరామర్శించారు. ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ప్రసాద్ చిత్రపటానికి ఎలీజా, పార్టీ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎలీజా మాట్లాడుతూ ప్రసాద్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

బస్సులో దొరికిన మనీపర్స్.. పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగింత

జంగారెడ్డిగూడెం : ఏలూరు - జంగారెడ్డిగూడెం బస్సులో దొరికిన మనీ పర్స్‌ను సోషల్ మీడియా ద్వారా బాధితుడికి అప్పగించారు. వివరాల ప్రకారం కామవరపుకోటలో బస్సు ఎక్కిన రత్నకుమారి అనే మహిళకు వివిధ కార్డులతో పాటు నగదు ఉన్న మనీ పర్స్ దొరికింది. ఆమె ఆ పర్సును కండక్టర్ శ్రీనివాస్‌కు అప్పగించి ఫొటోలతో కూడిన వివరాలను కామవరపుకోట చెందిన సోషల్ వర్కర్ వీరమల్ల మధుకి తెలిపారు. ఈ విషయాన్ని ఫేస్‌బుక్, వాట్సాప్‌లో పోస్ట్ చేయగా మచిలీపట్నానికి చెందిన మనీపర్స్ పోగొట్టుకున్న యువకుడు బొల్లా రంగయ్య బంధువులు మధుని సంప్రదించారు. చక్రాయగూడెంలోనే బస్సు దిగిన యువకుడు బొల్లా రంగయ్య తగిన గుర్తులు, ఆధారాలు, వివరాలు కంట్రోలర్‌కు తెలిపి మనీ పర్స్ తీసుకున్నారు. ఈ సందర్భంగా రంగయ్య తన మనీ పర్స్ తిరిగి అందజేసిన రత్నకుమారి, శ్రీనివాస్, మధు, కంట్రోలర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు

అప్పు తీర్చాలంటూ వ్యక్తిపై దాడి

ఏలూరు టౌన్: ఏలూరు పత్తేబాద ప్రాంతానికి చెందిన వ్యక్తిని అప్పు తీర్చాలంటూ మరో వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఏలూరు పత్తేబాద బృందం పార్కు సమీపంలో నివాసం ఉంటున్న జి.వెంకన్న అనే వ్యక్తి పందులు పెంచి, విక్రయిస్తూ ఉంటాడు. కుటుంబ అవసరాలు నిమిత్తం వడ్డీ వ్యాపారి కె.ప్రకాష్ వద్ద కొంతకాలం క్రితం రూ.10 వేలు అప్పు తీసుకున్నాడు. ఈ అప్పు తీర్చే క్రమంలో ఇరువురి మధ్య వివాదం తలెత్తింది. అప్పు తీర్చేసినా ఇంకా కట్టాలంటూ వడ్డీ వ్యాపారి బెదిరింపులకు పాల్పడేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేది రాత్రి అశోక్‌నగర్ మిలటరీ క్యాంటీన్ సమీపంలో పందులను తోలుకొచ్చేందుకు వెళ్లగా అక్కడకు వచ్చిన ప్రకాష్ బీరు సీసాతో తన పొట్టలో పొడిచి గాయపరిచి పారిపోయాడని బాధితుడు వెంకన్న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. గాయాలుపాలైన అతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అతను ప్రస్తుతం వైద్య చికిత్స పొందుతున్నారు.

ఘనంగా పరుశురామ జయంతి



మదన గోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో పరశురాముని జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : స్థానిక మదన గోపాల స్వామి ఆలయంలో పరశురాముని జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు ఆధ్వర్యంలో పరశురాముని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. దశావతారాలలో ఆరవ అవతారం పరశురామునిది అని లోక కళ్యాణార్థం ఇరవై నాలుగు మార్లు లోకాన్ని చుట్టి దుష్ట సంహారం గావించి ధర్మ ప్రతిష్టాపన చేశారన్నారు. అదేవిధంగా అక్షయ తృతీయను పురస్కరించుకొని టింపుల్స్ సెంటర్లో ఉన్న ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి



బుట్టాయగూడెంలో నిర్వహిస్తున్న ప్రచార భేరి ముగింపు సభ



యర్రగుంటపల్లిలో ప్రచార భేరి యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మోదీని గద్దె నుంచి దింపాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన దేశ రక్షణ భేరి ప్రచార యాత్ర ముగింపు సభ బుట్టాయగూడెంలో శనివారం నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న వారు మాట్లాడుతూ దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చాక బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని అన్నారు. దేశసంపదగా ఉన్న బ్యాంక్‌లను ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేడు సామాన్యులు బతికే పరిస్థితి లేదని, రోజురోజుకూ విపరీతంగా ధరలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య, సీపీఎం నాయకులు తెల్లం దుర్గారావు, తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యురాలు తామా ముత్యాలమ్మ, అందుగుల ఫ్రాన్సిస్, జి.వెంకట్రావు, కె.భాస్కర్, సీపీఐ నాయకులు కారం దారయ్య, ఎస్.సాయిబాబా, మడకం దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర వైఖరి ప్రజాస్వామ్యానికి ప్రమాదం

కొయ్యలగూడెం : కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా తయారైందని వామపక్షాల పార్టీల నాయకులు పేర్కొన్నారు. సీపీఐ, సీపీఎం ప్రచారభేరీలో భాగంగా బోడిగూడెం ఉపాధి హామీ కూలీలతో పలు గ్రామాలలో శనివారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలు దారుణంగా పెరిగాయని, దీంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో మోడీని గద్దించవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశపోయిన గోపి, ఆశపోయిన బోడెమ్మ, చిడిపి సుబ్బారావు, లక్ష్మి పాల్గొన్నారు.

చింతలపూడి : మోడీని గద్దె దించండి, దేశాన్ని కాపాడండి అని సీపీఐ, సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. యర్రగుంటపల్లిలో జరిగిన ప్రచార భేరి కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ఆర్‌వీ సత్యనారాయణ, సీపీఐ జిల్లా సమితి సభ్యులు పుల్లూరిసోమశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఎం సీనియర్ నాయకులు ఎస్.సూర్యకుమార్, వాసు, సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, సీపీఐ మండల కమిటీ సభ్యులు దంతా కృష్ణ, ఎస్కే మస్తాన్ పాల్గొన్నారు.